


రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మగళవారం సా : 6.35 గం.
సహర్ : బుధవారం ఉ : 4.46 గం.



రామచంద్రాపురం పరిధి బీహెచ్ఈఎల్‌లోని జ్యోతి విద్యాలయ హైస్కూల్

పది మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- రేపటి నుంచి 11 వరకు స్పాట్ క్యాంపు
- బీహెచ్ఈఎల్‌లోని జ్యోతి విద్యాలయంలో ఏర్పాట్లు
- అధికారుల కేటాయింపు
- పోలీస్ పహారాలో స్ట్రాంగ్ రూమ్
- వసతులు కల్పించిన విద్యాశాఖ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 1 : పదో తరగతి పరీక్షలు ముగియడంతో జవాబు పత్రాల మూల్యాంకనానికి విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పరిధిలోని జ్యోతి విద్యాలయ హైస్కూల్‌లో మూల్యాంకనం చేపట్టనున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 11 వరకు జవాబు పత్రాలను దిద్దనున్నారు. ఈ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అవసరమైన ఏర్పాట్లు చేసింది. కాగా మూల్యాంకనం పూర్తికాగానే వచ్చే నెలలో ఫలితాల విడుదల చేయాలని విద్యాశాఖ భావిస్తున్నది.

అధికారులకు బాధ్యతలు


మూల్యాంకన ప్రక్రియ సజావుగా జరిగేందుకు వీలుగా జిల్లా విద్యాశాఖ పలువురికి బాధ్యతలు అప్పగించింది. క్యాంపు అధికారిగా(డీఈవో), డిప్యూటీ క్యాంపు ఆఫీసర్స్ ఇద్దరు, కోడింగ్ క్యాంపు ఆఫీసర్స్ ఇద్దరు, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లు ఆరుగురు, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు ఆరుగురు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 632మంది, చీఫ్ ఎగ్జామినర్లు 109, స్పెషల్ అసిస్టెంట్లు 211 మందిని నియమించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఉపాధ్యాయులకు స్పాట్ విధులు కేటాయించారు. అయితే ఈ స్పాట్ క్యాంపులో 2.22 లక్షల జవాబు పత్రాలు దిద్దనున్నారు.

పోలీస్ భద్రత మధ్య..

ఇప్పటికే పదో తరగతి జవాబు పత్రాలను ప్రత్యేక వాహనాల్లో స్పాట్ కేంద్రమైన జ్యోతి విద్యాలయ హైస్కూల్‌కు చేర్చారు. పోలీస్ పహారా మధ్య స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేసి అందులో భద్రపర్చారు. కేంద్రంలోకి ఇతరులకు ప్రవేశం లేకుండా విధులు కేటాయించిన వారిని మాత్రమే అనుమతించేలా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. మూల్యాంకన కేంద్రంలో విధులు నిర్వహించే వారి కోసం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యాశాఖ అధికారులు అన్ని వసతులు కల్పించారు.

పకడ్బందీగా మూల్యాంకనం

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈవో వెంకటేశ్వర్లు, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ మణిదీప తెలిపారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఉన్నతాధికారుల మార్గదర్శకాలకనుగుణంగా మూల్యాంకనం చేపడుతామన్నారు. మూల్యాంకనం విధులు కేటాయించిన వారు విధిగా స్పాట్ కేంద్రానికి హాజరై రిపోర్టు చేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



పన్ను వసూళ్లలో నర్సాపూర్ టాప్

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపునకు ముగిసిన గడువు

- నర్సాపూర్‌లో 95.22 శాతం వసూలు
- రాష్ట్రంలో 6వ స్థానం ఉమ్మడి జిల్లాలో అగ్రస్థానం
- స్పందించిన ప్రజలు.. సర్కారు బకాయిలు పెండింగ్!



మెదక్/నర్సాపూర్/రామాయంపేట/తూప్రాన్, ఏప్రిల్ 1: కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను చెల్లింపునకు గడువు గత నెలతో ముగిసింది. మున్సిపాలిటీల్లో సిబ్బంది నెల రోజుల పాటు ముమ్మరంగా అవగాహన కల్పించి పన్ను వసూళ్లు చేయగా సామాన్య ప్రజలు స్పందించినా.. ప్రభుత్వ కార్యాలయాలు మాత్రం పట్టించుకోలేదు. ప్రజలు పన్ను చెల్లించినా గవర్నమెంటు ఆఫీసులు మాత్రం ఎప్పటిలాగే పన్ను చెల్లింపుపై స్పందించ లేదు. మెదక్ మున్సిపాలిటీలో రూ.4.80 కోట్ల ఆస్తిపన్ను డిమాండ్ ఉండగా రూ.4.20 కోట్లు వసూలయింది. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో రూ.1.43 కోట్ల లక్ష్యం నిర్దేశించుకోగా.. రూ.1.32 కోట్లు (92.42 శాతం) చెల్లించారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో రూ.3.17 కోట్ల పన్ను వసూలు డిమాండ్ ఉండగా.. రూ.3.02 కోట్ల పన్ను వసూలు చేసి 95 శాతం పురోగతి సాధించింది. రామాయంపేట మున్సిపాలిటీలో 62 శాతం మేర పన్ను బకాయిలు వసూలు చేశారు. ఇక్కడ రూ. 1.20 కోట్లకు గాను.. రూ. 83.36 లక్షలు పన్ను వసూలయింది. పన్ను చెల్లించని వారు కోసం 5 శాతం రాయితీతో ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చారు.

నర్సాపూర్ మున్సిపాలిటీలో రూ. 3.02 కోట్లు

నర్సాపూర్ మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో ఆరో స్థానం.. ఉమ్మడి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి నర్సాపూర్ మున్సిపాలిటీలో 3.17 కోట్ల పన్ను వసూలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకోగా.. రూ. 3.02 కోట్లు చేశారు. 95.22 శాతం వసూళ్లతో మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని అన్ని మున్సిపాలిటీల్లోనూ నంబర్‌వన్‌గా నిలిచింది. దీనిపై మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ జైతురాంనాయక్ స్పందిస్తూ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది ఉమ్మడి కృషితోనే నర్సాపూర్ ముందంజలో నిలిచిందన్నారు. ప్రజల సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

తూప్రాన్‌లో 92.42 శాతం

తూప్రాన్: తూప్రాన్ మున్సిపాలిటీలో 92.42 శాతం ఆస్తి పన్ను వసూలయింది. మున్సిపల్ పరిధిలో 6,308 ఇళ్ల నుంచి రూ. 1.43 లక్షల పన్ను వసూలు చేయాల్సి ఉంది. గడువు లోపు రూ. 1.324 కోట్లు వసూలయ్యాయి. రూ. 10.85 లక్షలు బకాయిలు ఉన్నాయి. 20 ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ. 4.11 లక్షలు రావాల్సి ఉండగా రూ. 14 వేలు మాత్రమే వసూలు కావడం గమనార్హం.

జిల్లాలోనే అత్యల్పం..

రామాయంపేట: రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 1.31 కోట్ల పన్నులుఉ వసూలు చేయాల్సి ఉండగా.. రూ. 83.36 లక్షలు మాత్రమే వసూలయింది. 63.62 శాతం వసూళ్లతో మెదక్ జిల్లాలోనే ఆఖరున నిలిచింది. రూ. 47 లక్షలు రావాల్సి ఉండగా.. కోర్టు కేసుల్లో ఉన్న ఆస్తులు పోను రూ. 27 లక్షలు పెండింగ్ ఉన్నట్టు మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు.

సైబర్ నేరాల నియంత్రణకు 'వారియర్స్'

ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక టీం ఏర్పాటు

మెదక్, సంగారెడ్డి ఎస్పీలు



సైబర్ వారియర్స్‌కి ఫోన్లు అందజేస్తున్న మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్/సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 1: సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీస్ సైబర్ వారియర్స్ బృందాలు పనిచేస్తాయని మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి, సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాల్లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్లవారీగా సైబర్‌వారియర్స్‌కు ప్రత్యేక ఫోన్ నంబర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్ టీంలను ఏర్పాటు చేసి, వారికి ప్రత్యేక ఫోన్లను అందజేస్తున్నట్టు తెలిపారు. సైబర్ నేరాల బారినపడినవారు 1930 నంబర్‌కు కానీ, కేటాయించిన ప్రత్యేక నంబర్లకు కానీ కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. మెదక్‌లో కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ మహేందర్, సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డిలో సైబర్ సెల్ ఇన్‌చార్జి వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో 'వారియర్స్' ఫోన్ నంబర్లు

మెదక్ టౌన్	8712657978
మెదక్ రూరల్	8712657979
రామాయంపేట	8712657866
తూప్రాన్	8712657869
నర్సాపూర్	8712657864
అల్లాదుర్గం	8712657861
చేగుంట	8712657862
కొల్చారం	8712657863
పాపన్నపేట	8712657865
శివ్వంపేట	8712657867
టేక్మాల్	8712657868
హవేళీఘణపూర్	8712657970
నార్సింగి	8712657971
నిజాంపేట	8712657972
మనోహరాబాద్	8712657973
వెల్దుర్తి	8712657974
చిలప్‌చెడ్	8712657975
కౌడిపల్లి	8712657976
రేగోడ్	8712657977
పెద్దశంకరంపేట	8712657980
చిన్నశంకరంపేట	8712666266

మాట నిలుపుకునే పార్టీ కాంగ్రెస్

- ఇందిరమ్మ కమిటీలతో నిరుపేదలకు ప్రయోజనం
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



జహీరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జహీరాబాద్, ఏప్రిల్ 1 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి నిబద్ధతతో పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ మాట్లాడుతూ పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 120 రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేశామన్నారు. పెద్దమొత్తంలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని తెలిపారు. త్వరలో గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి నిరుపేదలకు ప్రయోజనం చేకూర్చే విధంగా కాంగ్రెస్ కృషి చేస్తామని మంత్రి తెలిపారు. ధరణి, 317 జీవో, 46 జీవోలు రాష్ట్రానికి శాపంగా మారాయని మండిపడ్డారు. లింగాయత్‌లను ఓబీసీలుగా గుర్తించేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. జహీరాబాద్ ప్రాంతానికి ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌కుమార్‌షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు నిర్మలాజగ్గారెడ్డి, గిరిధర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, సంజీవరెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయి చరణ్, ఆయా మండలాల అధ్యక్షులు నర్సింహారెడ్డి, రామలింగారెడ్డి, మక్సూద్, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో ముస్లింలకు పండు తినిపించి ఉపవాస దీక్ష విరమింపజేస్తున్న మంత్రి దామోదర్

ఈ నెల 30 వరకు ఓటరు చైతన్య కార్యక్రమాలు

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 1 : లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ నమోదు చేయడమే లక్ష్యంగా రేపటి నుంచి 30 వరకు ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 'స్వీప్'లో భాగంగా కార్యక్రమాలు రూపొందించామని పేర్కొన్నారు. ఈమేరకు ఈ నెల 6, 20, 21, మే 4, 5 తేదీల్లో పట్టణ ప్రాంతాల్లో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, గెటెడ్ కమ్యూనిటీల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో ఈ నెల 16న ఓటర్లతో 2కే-రన్ నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ నెల 18న తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లతో నియోజకవర్గ కేంద్రాల్లో సైకిల్‌ర్యాలీలు, 19న జూనియర్, డిగ్రీ కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించాలని నిర్దేశించారు. వీటితో పాటు ఈ నెల 30 వరకు పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు, ఎంపీడీవోలు, ఏఈఆర్వోలు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు.

ఎండాకాలం జాగ్రత్త..

వేసవి తీవ్రతకు ప్రజలు అస్వస్థతకు గురవకుండా, వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. చిన్నారులు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, పరిశ్రమలు, సినిమా హాల్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఆసుపత్రుల్లో అగ్నిమాపక వ్యవస్థ ఉండేలా చూడాలని, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, స్వీప్ నోడల్ అధికారి జగదీశ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 1: జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. ఎండల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దన్నారు. ఎండలో పనిచేసే కార్మికులకు తరచుగా నీటితోపాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలన్నారు. వేసవిలో జాగ్రత్తలు పాటిస్తూ.. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, డీఎంహెచ్‌వో శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి లేదన్నా వస్తున్న ప్రజలు

ఇన్‌వార్డు సెక్షన్‌లో ఫిర్యాదు అందజేసి వెనుదిరిగి..

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 1 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసిన విషయం తెలిసిందే. అయినా తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్జీలు అందజేసేందుకు ప్రజలు కలెక్టరేట్‌కు వస్తూనే ఉన్నారు. ప్రజావాణి లేకపోవడంతో ఉసూరుమంటూ ఇన్‌వార్డ్ సెక్షన్‌లో ఆర్జీలు అందజేసి వెళ్లిపోయారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యే వరకు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఉండదని, ఫిర్యాదుదారులు రావొద్దని కలెక్టర్ క్రాంతి తెలిపారు.



కలెక్టరేట్‌లో బాధితులు

పొదుపు సంఘాల ఆడిట్

- ఈ నెలాఖరులోగా మొదలు
- జిల్లాలో 18,795 మహిళా సంఘాలు



సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 1 : మహిళా పొదుపు సంఘాల్లో లెక్కలు పక్కాగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆడిట్ ప్రక్రియను చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. మహిళా సంఘాల లెక్కలన్నీ వీవోఏలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ వివరాలన్నీ రికార్డుల్లోనూ అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. ఆడిట్‌లో భాగంగా ఆన్‌లైన్, పుస్తకాలను పరిశీలించనున్నారు. రికార్డుల్లోని సమాచారం.. ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలకు తేడాలు ఉన్నాయా అని ఆరా తీయనున్నారు. తేడా ఉంటే కారణాలు తెలుసుకుంటారు. రికార్డుల్లో నమోదైన వాటిలో కొన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్ల లెక్కల్లో తేడాలుంటే సరి చేస్తారు. ఈ నెలాఖరు నాటికి ఆడిట్ ప్రక్రియను మొదలు పెట్టడానికి కసరత్తు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 18,795 మహిళా సంఘాలు ఉండగా, 1.90 లక్షల మంది సభ్యులు ఉన్నారు.

ఆర్థిక పరిస్థితుల మెరుగుకు ప్రణాళికలు

జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో మహిళా సంఘం చేసిన పొదుపులు, తీసుకున్న రుణాలు, వాయిదాల చెల్లింపుల వివరాలతో బ్యాంకు నిల్వల సమన్వయపట్టికను తయారు చేయనున్నారు. దీని వల్ల సంఘం ఆర్థిక పరిస్థితి ఏమిటో సభ్యులకు తెలిసి పోతుంది. ఆడిట్ నివేదిక ఆధారంగా వెనుకబడిన సంఘాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఆర్థిక ప్రగతికి ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకొనేలా ప్రోత్సహించనున్నారు. ఆడిట్‌తో పొదుపు సంఘాల లెక్కల్లో పారదర్శకతకు బాటలు పడతాయని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు తెలిపారు.

తూప్రాన్ ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం

- భవనం అద్దె చెల్లించలేదని యజమాని చర్య
- మధ్యాహ్నం 12 గంటల వరకు వేచిచూసి వెళ్లిపోయిన సిబ్బంది

7లో

బొమ్మారెడ్డిగూడెంలో ఎక్సైజ్ దాడులు

● అక్రమ మద్యం స్వాధీనం, కేసు నమోదు



గిరిజనతండాలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

పుల్‌కల్, ఏప్రిల్ 1: చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజనతండాలో ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గిరిజనతండాకు చెందిన నెనావత్ దేవీదాస్, మూడ్ అర్జున్ స్థానికంగా కిరాణ దుకాణాలు నిర్వహిస్తున్నారు. అదే కిరాణ దుకాణాల్లో అనుమతి లేకుండా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి అధ్వర్యంలో ఎస్ఐలు విజయ్‌కుమార్, సందీప్ రెడ్డి, హనుమంతు, ఇతర సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో నెనావత్ దేవీదాస్, మూడ్ అర్జున్ కిరాణా దుకాణాల్లో బీరు బాటిళ్లు, ఇతర దేశీ లిక్కర్ బాటిళ్లు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్ రెడ్డి తెలిపారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గ్రామాలు, గిరిజనతండాలు, గూడాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే తమకు తెలియజేయాలని ఆయన సూచించారు.

యువకుడి ఆత్మహత్య



రవి(ఫైల్)

వెల్దుర్తి, ఏప్రిల్ 1: ప్రేమించిన అమ్మాయికి వేరే వ్యక్తితో నిశ్చితార్థం కావడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ నవత, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దామరంచ గ్రామానికి చెందిన దోమల రవి(23) పొలం పనులతో పాటు కోళ్ల ఫారం పనులు చేసుకుంటే తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. అయితే రవి ప్రేమించిన అమ్మాయికి వేరే వ్యక్తితో నిశ్చితార్థం కావడంతో మనస్తాపానికి గురైన రవి కోళ్ల ఫారంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నారాయణఖేడ్‌లో అగ్ని ప్రమాదం

● రూ.60 వేల నష్టం

నారాయణఖేడ్, ఏప్రిల్ 1: ఖేడ్ పట్టణం బసవేశ్వర చౌక్ సమీపంలోని శంకరప్ప ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. స్థానికులు అగ్నిమాక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పేశారు. ఆలోపే శంకరప్ప ఇంట్లోని ఫ్రీజ్, కూలర్, దుస్తులు, ఆహార ధాన్యాలు, ఇతర సామగ్రి కాలిపోయాయి. దీంతో రూ.60 వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

మన్‌సాన్‌పల్లిలో తాగునీటి తండ్లాట

● అందని ద్రాక్షగా 'మిషన్ భగీరథ'

● మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పినా పట్టించుకోని అధికారులు

కొండాపూర్, ఏప్రిల్ 1: ఆ గ్రామం తాగునీటి కోసం తండ్లాడుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన మంజీరా నీటి పథకం, తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకాలకు సంబంధించిన నీరు సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మన్‌సాన్‌ల్లి గ్రామానికి ఇంతవరకూ అందలేదు. 12 ఏళ్ల నాటి మంజీరా సురక్షిత మంచినీరు పేరు మారిందే.. కానీ మా గ్రామానికి చుక్కనీరు రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. మన్‌సాన్‌పల్లి సంగారెడ్డి జిల్లా అయినా రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాలకు 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వికారాబాద్ జిల్లాకు సరఫరా అయ్యే కృష్ణానది జలాల పైపులైన్ ఈ గ్రామ పరిసరాల నుంచే వెళ్తున్నది. రెండు కిలోమీటర్ల దూరంలోని ఎల్లకొండ శివారులో కృష్ణా జలాల లిఫ్టింగ్ వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ సైతం అందుబాటులో ఉన్నది. అయినా గ్రామానికి చుక్క నీరు అందని పరిస్థితి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సురక్షిత మంచినీటి పేరుతో మంజీరా నీటి పథకాన్ని అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి 2012లో కొండాపూర్ మండలంలో ప్రారంభించారు. ప్రతి గ్రామానికి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. మన్‌సాన్‌పల్లికి పైపులైన్ వేసినా గ్రామం ఎత్తులో ఉండడంతో నీరు అందలేదు. పైపులైన్లు పగిలిపోవడంతో సర్పంచ్ సొంత డబ్బులతో పైపులు మార్చినా ఫలితం లేదు. ఆ తర్వాత ఎన్నికైన పంచాయతీ పాలకవర్గం జిల్లా మంత్రులను, అధికారులను కలిసినా ప్రయోజనం లేదు. కృష్ణా జలాలను అందించేందుకు రెండు జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, చింతా ప్రభాకర్ రెండు జిల్లాల ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరారు. 2019లో ఎమ్మెల్యే జగ్గారెడ్డి మన్‌సాన్‌పల్లి నుంచి వెళ్తున్న కృష్ణానది జలాలను పైపుల ద్వారా సరఫరా చేయాలని సంబంధిత అధికారికి నిధులిచ్చినా.. సరైన ప్రణాళిక లేక నీళ్లు అందించడంలో విఫలమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వికారాబాద్, హైదరాబాద్ ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న మన్‌సాన్‌పల్లి ముఖద్వారం


మంజీరా నీటి కోసం మొదటి విడత వేసి వదిలేసిన పైపు(ఫైల్)



మన్‌సాన్‌పల్లి గ్రామంలో మిషన్ భగీరథ నీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్

ప్రజాధనాన్ని నిర్వీర్యం చేశారు



మంజీరా నీటిని ప్రజలకు అందించాలని 2013లో రూ.2 లక్షలు ఖర్చుచేసి పైప్‌లైన్ వేయించినా లాభంలేదు. గ్రామ సమీపం నుంచే కృష్ణా జలాలు సరఫరా అవుతున్నా.. మాకు అందడం లేదు. ప్రతిపాదనలు, ప్రణాళికలు సరిగ్గా లేక మూడుసార్లు పైపులను మార్చారు. పథకం అమలు పేరుతో అధికారులు ప్రజాధనాన్ని నిర్వీర్యం చేస్తున్నారు.

- వెంకటమ్మ, మాజీ సర్పంచ్

మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పినా వినలేదు



నీటి సమస్యను పరిష్కరించాలని రెండు జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు రెండు జిల్లాల ఉన్నతాధికారులు, మిషన్ భగీరథ ఈఈలతో మాట్లాడి సమస్యను తీర్చాలన్నారు. అప్పుడు సరే అన్న అధికారులు.. ఆ తర్వాత పట్టించుకోలేదు. ఇప్పుడేమో మీ గ్రామానికి నీరు ఇవ్వాలంటే.. మా పరిధిలోని గ్రామానికి నీరు ఇవ్వాలని అధికారులు సాకులు చెబుతున్నారు.

- అనితానర్సింహులు, మాజీ సర్పంచ్

నీటిని సరఫరాకు ప్రయత్నం చేస్తున్నాం

నేనొచ్చి సంవత్సరమైంది. అంతకుముందు సమస్య తెలియదు. వికారాబాద్ జిల్లా ఈఈతో మాట్లాడి నీటి సరఫరాకు పైపులను అమర్చాం. వారి పరిధిలోని గ్రామాలకే సరిపడా నీరు లేదని తెలిసింది. మునిదేవునిపల్లిలో సంప్ ఏర్పాటు చేసి పంపింగ్ చేయాలనే ప్రపోజల్స్ పంపించాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. గ్రామానికి నీరు అందించేందుకు చర్యలు చేపడతాం.

- సుచరిత, మిషన్ భగీరథ డీఈ

తూప్రాన్ ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం

● ఇంటి అద్దె చెల్లించడం లేదని యజమాని చర్య

● మధ్యాహ్నం 12 గంటల వరకూ చూసి వెళ్లిన సిబ్బంది

తూప్రాన్, ఏప్రిల్ 1: అద్దె చెల్లించడంలేదని ఆగ్రహించిన ఇంటి యజమాని కార్మికులకు వైద్య సేవలు అందించే ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం వేశాడు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలో సోమవారం చోటుచేసుకున్నది. శివ్వంపేట మండలం శబాష్‌పల్లిలో కార్మికులకు సేవలందించేందుకు ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయగా, ఇది తూప్రాన్ పట్టణంలో కొన్నేళ్లుగా కొనసాగుతున్నది. పట్టణ పరిధి పోతరాజుపల్లిలోని ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి ఈ డిస్పెన్సరీ ఇంట్లో నిర్వహిస్తున్నారు. అయితే, గతేడాది జూలై నుంచి అద్దె చెల్లించడం లేదు. అలాగే, అద్దెను కూడా పెంచాలంటూ కోరుతూ యజమాని ప్రతాప్‌రెడ్డి ఈఎస్ఐ సిబ్బందికి లేఖ అందజేశారు. అయినప్పటికీ అద్దె చెల్లింపులు చేయకపోవడం, పెంపును అమలు చేయకపోవడంతో యజమాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఈఎస్ఐ ఆస్పత్రి డిస్పెన్సరీకి తాళం వేశాడు. దాంతో విధులకు వచ్చిన సిబ్బంది, వైద్యుడు బయటే ఉండిపోయారు. అద్దె చెల్లింపులు చేయడంతోపాటు, అద్దె పెంపు తేల్చాలంటే యజమాని పట్టుబట్టారు. చేసేదీ లేక సిబ్బంది బయటే ఉండిపోయారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి చూసిన ఇబ్బంది, వైద్యుడు గత్యంతరం లేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ తాళం తెరచుకోకపోవడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


పోతరాజుపల్లిలో తాళం వేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీ, బయట నిలిచిన సిబ్బంది

యేడాది కాలంగా అద్దె రావాలి

ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె గతేడాది మార్చి నుంచి రావాల్సి ఉంది. నాలుగేళ్లుగా అద్దెను కూడా పెంచి ఇవ్వాలని కోరుతున్నాను. పెండింగ్ అద్దెలు చెల్లించేందుకు అగ్రిమెంట్ చేయిస్తూ మోసం చేస్తున్నారు. 9 గదుల భవనానికి కేవలం రూ. 9,700లు చెల్లిస్తున్నారు. రూ.20వేలు చెల్లించాలి. బకాయి అద్దె వెంటనే ఇవ్వాలి.

- ప్రతాప్‌రెడ్డి, భవన యజమాని

చెరువులో జారిపడి వ్యక్తి మృతి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 1: చెరువులో జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు.. స్థానిక బ్రాహ్మణ వీధికి చెందిన శివనూరి సత్యనారాయణ(52) పట్టణంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. గతనెల 28న తొగిటలో ఉంటున్న చిన్న కూతురు రజిత ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి 29 శుక్రవారం సాయంత్రం ఇంటికి బయలుదేరాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో భార్య సునీత కూతురుకు ఫోన్‌చేయగా.. ఇంటి నుంచి బయలుదేరాడని చెప్పింది. దాంతో పరిసర ప్రాంతాల్లో గాలించారు. సోమవారం స్థానిక పిట్లంచెరువులో మృతదేహం నీటిపై తేలింది. దాంతో హోటల్ యజమానికి సమాచారమందించారు. మృతదేహాన్ని చూసిన కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు.


సత్యనారాయణ (ఫైల్)

చిల్వర్ వద్ద రోడ్డు ప్రమాదం

● ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన మరో లారీ

● క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్, అరగంట పాటు నరకయాతన

అల్లాదుర్గం, ఏప్రిల్ 1: అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామం వద్ద గల 161వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. అల్లాదుర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం పట్టణానికి సామగ్రితో లారీ వెళ్తున్నది. చిల్వర్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీ టైర్ పగిలిపోవడంతో ఒక్కసారిగా నిలిచిపోయింది. దీంతో వెనకున్న లారీ ముందు లారీని ఢీకొట్టడంతో లారీ ముందుభాగం నుజ్జు నుజ్జయింది. లారీ డ్రైవర్ విజయ్‌కుమార్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి సుమారు అరగంట పాటు నరకయాతను పడ్డాడు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పోలీసులకు సమాచారమందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి లారీ డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి తీసి.. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.


లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అవస్థ పడుతున్న డ్రైవర్ విజయ్‌కుమార్

గజ్వేల్‌లో 200 గ్రాముల గంజాయి స్వాధీనం

గజ్వేల్, ఏప్రిల్ 1: గజ్వేల్ పట్టణంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్డులోని శ్మశానవాటిక వద్ద ఇద్దరు గంజాయిని విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారంతో సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 200 గ్రాముల గంజాయి, ఓ మోటార్ సైకిల్, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులు హైదరాబాద్‌లో తమ స్నేహితుల వద్ద నుంచి తీసుకొచ్చి అమ్ముతున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

విద్యాధరి క్షేత్రంలో వైభవంగా మూలమహోత్సవం

● విద్యాసరస్వతీ అమ్మవారికి లక్ష పుష్పార్చన

● భక్తి పారవశ్యమైన శంభుగిరి కొండలు

వర్గల్, ఏప్రిల్ 1: వర్గల్ శంభుగిరి కొండలపై వెలసిన విద్యాధరి క్షేత్రంలో విద్యా సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్ర మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోశ్ఛరణలతో మూల మహోత్సవానికి అంకురార్పణ చేశారు. ఆలయ మండపంలో అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. భక్తులు, వేద విద్యార్థులు లక్ష పూలపూజ చేశారు. ఆలయ యాగశాలలో చండీహోమం నిర్వహించారు. వేడుకలకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు ఆలయ కమిటీ మహా అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. సరస్వతీ అమ్మవారి దర్శనంతో పాటు క్షేత్రంలోని ఉప ఆలయాలైన లక్ష్మీగణపతి, కల్యాణ వెంకటేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడాయి.


లక్ష పుష్పార్చన చేస్తున్న భక్తులు, వేద విద్యార్థులు

అధికారుల కృషితో నల్లచెరువు నీటి విడుదల

● హర్షం వ్యక్తం చేస్తున్న చెన్నాయిపల్లి రైతులు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 1: చిన్నశంకరంపేట మండలంలోని చెన్నాయిపల్లి గ్రామ రైతుల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కొన్నిరోజులుగా శాలిపేట గ్రామానికి చెందిన రైతులు చెన్నాయిపల్లి పంట పొలాలకు నల్లచెరువు నుంచి నీరు విడుదల చేయకుండా అడ్డుకున్న సంగతి విదితమే. దీంతో రైతులు నల్లచెరువు నుంచి నీటిని విడుదల చేయాలని శాలిపేట గ్రామస్థులను కోరగా నిరాకరించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రెండురోజులుగా ఇరుగ్రామాల పెద్దలను సమన్వయ పరిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. పంటలు ఎండిపోవడాన్ని చూసి చలించిన అధికారులు చెరువు నుంచి నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టారు. శాలిపేట గ్రామస్థులు సహకరించడంతో చెన్నాయిపల్లి గ్రామ శివారులోని పంటలకు నీరు చేరుకుంటున్నది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


శాలిపేట నల్లచెరువు నుంచి విడుదలవుతున్న నీళ్లు


తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో పంట కాపాడుకోవడానికి ట్యాంకర్ ద్వారా నీటిని పోస్తున్న రైతు


శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్‌లో ట్యాంకర్ ద్వారా పంటకు నీరందిస్తున్న రైతు

రైతుల భగీరథ ప్రయత్నం

● చేతికొచ్చిన పంట కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని తరలింపు

తొగుట/శివ్వంపేట, ఏప్రిల్ 1: తలాపున మల్లన్నసాగర్ ఉన్నా.. బోరుబావుల్లో నీటి ఊటలు అడుగంటిపోయాయి. చేతికొచ్చిన పంట కళ్లముందే ఎండిపోతుంటే కాపాడుకునేందుకు తొగుట మండలం తుక్కాపూర్ గ్రామానికి చెందిన రైతు చిక్కుడు చంద్రం భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. తనకున్న మూడెకరాల పొలంలో ఇప్పటికీ ఏడు బోర్లు వేయించినా.. రెండు బోర్లలో మాత్రమే కొద్దిపాటి నీరు వచ్చింది. ఆ నీటితో వరి సాగుచేశాడు. పంట చేతికందే దశలో ఉన్న బోరులో నీటి ఊటలు అడుగంటిపోవడంతో పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. పంటను ఎలాగైనా కాపాడుకోవడం కోసం మూడురోజులుగా ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి పారిస్తున్నాడు. పంట సాగుకోసం ఇప్పటివరకు సుమారు రూ.70 వేలు పెట్టినట్లు రైతు వాపోయారు. అలాగే శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు వెంకట్‌రెడ్డి తన పది గుంటల పొలంలో ఆకు కూరలు సాగుచేశాడు. పంట చేతికొచ్చిన సమయంలో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఐదురోజులుగా ట్యాంకర్ ద్వారా నీరు తెచ్చి పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.

తుంపర్ల సాగుతో అధిక లాభాలు

● తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి ● మిర్చి సాగులో దర్గపల్లి ఆదర్శం

నంగునూరు, ఏప్రిల్ 1: తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై రైతులు దృష్టిసారిస్తున్నారు. తుంపర్ల సేద్యంతో అధిక లాభాలు ఉండడంతో ఆరుతడి పంటలైన వేరుశనగ, మొక్కజొన్న, బీరకాయ, కాకరతో పాటు పలు రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల తోటలను వ్యవసాయ అధికారుల సూచనలతో సాగుచేసేందుకు ముందుకు వస్తున్నారు. అందులో భాగంగానే నంగునూరు మండలం దర్గపల్లి గ్రామంలో రైతులు తుంపర్ల ద్వారా మిర్చి పంటను సాగుచేస్తున్నారు. మిర్చి పంట సాగుతో గ్రామంలో కూలీలకు ఉపాధితో పాటు మంచి లాభాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రతి యాసంగిలో ఈ గ్రామంలో పెద్దఎత్తున మిర్చి పంటలు సాగుచేస్తూ మంచి లాభాలు పొందుతున్నారు. ఈసారి గ్రామంలో 200 ఎకరాల్లో మిర్చి సాగుచేస్తున్నారు. గత శివరాత్రి నుంచి మిర్చికి మంచి రేటు ఉండడంతో వ్యాపారులే రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రతిసారి ఇక్కడి నుంచి కరీంనగర్, వరంగల్, సిద్దిపేట ప్రాంతాల్లోని మార్కెట్‌కు తరలించేవారు. ఈసారి ఇతర జిల్లాల కంటే సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోనే కిలో మిర్చికి రూ.45 నుంచి రూ.50లు పలుకుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దర్గపల్లిలో తుంపర్ల ద్వారా పంటలు సాగుచేస్తుంటే, వెంకటాపూర్‌లో మాత్రం రైతులు బిందు సేద్యం ద్వారా కూరగాయల పంటల సాగుచేస్తూ జిల్లాలోని ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుత ఎండాకాలంలో వరి సాగుచేస్తే పంట చేతికి వచ్చే దశకు ఎండిపోయి రైతులు నష్టాలకు గురవుతున్నారు. ఆరుతడి పంటలపై దృష్టిసారిస్తే అధిక లాభాలు పొందొచ్చు అనడానికి దర్గపల్లి, వెంకటాపూర్ గ్రామాలే నిదర్శనం.


నంగునూరు మండలం దర్గపల్లి గ్రామంలో సాగుచేస్తున్న మిర్చి పంట

తాగునీటి ఎద్దడి నివారణకు వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకుంటాం



సీతారాంతండా వాసులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్, ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు

కొల్చారం, ఏప్రిల్ 1: తాగు నీటి సమస్య ఉన్నచోట వ్యవసాయ బోర్ బావులను లీజుకు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్, కొల్చారం ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు తెలిపారు. కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేట తండా, సీతారాం తండాలో నెలకొన్న నీటి సమస్యను సోమవారం ఆయన పరిశీలించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు చాలా చోట్ల పగిలిపోతుండడంతో తరచూ నీటి సమస్య తలెత్తుతోంది. వేసవికాలం ప్రారంభంలోనే తండాలలో తాగునీటి ఎద్దడి నెలకొన్నది. వారం రోజులకు ఒక్కసారి కూడా నీళ్లు సరిగా రావడం లేదు. దీంతో గిరిజనులు వ్యవసాయ బోర్‌బావులపై ఆధారపడాల్సి వస్తుంది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్ సీతారాం తండాలో నీటి సమస్యను స్వయంగా పరిశీలించారు. తండాకు చెందిన మాలోతు రవి తన వ్యవసాయ బోర్‌ను తండా తాగునీటి కోసం లీజుకు ఇస్తానని తెలిపారు. రెండు మూడు రోజుల్లో బోరు నుంచి పైప్‌లైన్ పనులు చేయించి తాగునీటి ఎద్దడి తీర్చుతామని డీఈ తెలిపారు.

దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు

● సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్



కందిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి



హవేళిఘణపూర్: కొత్తపల్లిలో కొనుగోలు సెంటర్‌ను ప్రారంభిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ వెంటేశ్వర్లు

కంది, ఏప్రిల్ 1 : రైతులు ఎంతో శ్రమించి పండించిన వరిధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి సూచించారు. సంగారెడ్డి జిల్లా కంది మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఈసారి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభిస్తున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారని తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చేటపుడు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీవో తుమ్మ ప్రసాద్, డీఎస్‌వో వనజాత, సీఈవో మందాడ శ్రీధర్‌రెడ్డి, ఆదర్శ రైతులు మోహన్‌రెడ్డి, కేశవరెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

తూకంలో పారదర్శకత పాటించాలి

● మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

హవేళిఘణపూర్, ఏప్రిల్ 1; జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో కొనుగోలు సెంటర్ల వద్ద తప్పనిసరిగా టెంట్లు, తాగునీరు, విద్యుత్ వసతి, టార్పాలిన్‌లు, ప్యాడీక్లీనర్‌లు, తూకం వేసేయంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. తూకంలో పారదర్శకత పాటించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేసమయంలో నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు కలిగిఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించాలన్నారు. ఆయా శాఖల సంబంధిత అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్‌లు, తూకం, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉన్నాయని, వీటిని రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిలు, రైతులు పాల్గొన్నారు.

పాపన్నపేట మండలంలో..

పాపన్నపేట, ఏప్రిల్ 1:వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం సాయిలు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని శానాయిపల్లి, గాజులగూడెం, నామాపూర్, నార్సింగి, అర్కెల గ్రామాల్లో జిల్లా డీఆర్డీఏ అదనపు ప్రాజెక్ట్ అధికారి సరస్వతి, జిల్లా డీపీఎం మోహన్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు చేతుల మీదుగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలు, గ్రామ సంఘాల అధ్యక్షురాలు ఐకేపీ సీసీలు, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

పెద్దచెరువు తూము షట్టర్ ఊడి ఏడాదైనా.. అధికారులకు పట్టదా?



సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్ పెద్ద చెరువు తూముకు షట్టర్ లేని దృశ్యం

కల్హేర్/సిర్గాపూర్, ఏప్రిల్ 1: మిషన్ కాకతీయ పనుల్లో నాణ్యత కొరవడి మరోమారు డొల్లతనం బయటపడింది. సిర్గాపూర్ మండల పరిధిలోని సుల్తానాబాద్(నల్లవాగు) శివారులోని పెద్ద చెరువు తూముకు నామమాత్రంగా షట్టర్ బిగించగా అది ఊడిపోయింది. చాలా రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ నీటిపారుదలశాఖ అధికారులు నేటికీ మరమ్మతులు చేపట్టలేదని ఆదివారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా షట్టర్ బిగించకపోతే వచ్చే వర్షాకాలంలో వర్షపు నీరు వృథాగా పోతుందని వాపోతున్నారు. అప్పట్లో లక్షల రూపాయలు వెచ్చించి చేపట్టిన మిషన్ కాకతీయ పనులు నాసిరకంగా ఉండటం, నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువుల కింద ఉన్న ఆయకట్టు భూముల రైతులకు ఎప్పటిలాగే తిప్పలు తప్పడం లేదు. 80 ఎకరాల ఆయకట్టు ఉన్న సుల్తానాబాద్ పెద్ద చెరువు తూము షట్టర్ ఏడాది క్రితం ఊడిపోగా నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారమిచ్చినా తూముకు షట్టర్ బిగించలేదని రైతులు ఆరోపించారు. ఫలితంగా గత ఏడాది వర్షపు నీటిని నిల్వ చేసేందుకు తాము ఎన్నో ప్రయత్నాలు చేసినా చెరువులో నీరు ఉండడంలేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకుని జూన్ వరకు చెరువు తూముకు షట్టర్ బిగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చస్తున్నారు.

7న మోడల్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్ష

రేగోడు ఏప్రిల్ 1: మోడల్ స్కూల్‌లో ఎంట్రెన్స్ పరీక్ష ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు రేగోడు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయప్రకాష్ సోమవారం తెలిపారు. రేగోడు మోడల్ స్కూల్‌లోనే 6వ తరగతికి ఉదయం 10 గంటలకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2గంటలకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

గాయపడిన దంపతులకు చేయూత

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 1 : సంగారెడ్డి పట్టణానికి చెందిన సంతోషి, నాగరాజు దంపతులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా అయ్యప్ప ఆపద్బాంధవ సేవా సమితి అధ్వర్యంలో సోమవారం రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి రాము, ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి మాణిక్‌రెడ్డి, సభ్యులు వెంకన్న, నరేష్‌కుమార్, శ్రీకాంత్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

హవేళిఘణపూర్, ఏప్రిల్ 1: మండలంలోని కొచ్చెర్వుతండా గ్రామానికి చెందిన స్వప్న అనే గర్భిణిని సోమవారం పురిటి నొప్పులతో 108 వాహనంలో మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా వాహనంలో ప్రసవించింది. ఈఎన్‌టీ శ్రీహరి వాహనంలోనే డెలివరీ చేయగా పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లిబిడ్డను హస్పిటల్‌కు తరలించారు.

నీటి ఎద్దడి రాకుండా చూడాలి

● ఎంపీడీవో మాధవిలత

నర్సాపూర్, ఏప్రిల్ 1: నర్సాపూర్ మండలంలో ఏ గ్రామంలో కూడా ఈ వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మాధవీలత పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి కాలం ఎండలు బాగా ఉండటంతో భూగర్భజలాలు అడుగంటి నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. ముందుగానే ఏయే ప్రాంతాల్లో నీటి సమస్య ఉందో గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. ప్రజలు నీటి సమస్యపై ఎక్కడా ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు హక్కుపత్రం ఇవ్వాలి

నర్సాపూర్, ఏప్రిల్ 1: శ్మశాన వాటికకు హక్కు పత్రం ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ మండల పరిధిలోని కాగజ్‌మద్దూర్ గ్రామంలో మాల కులస్థులు ఎన్నో ఏళ్లుగా శ్మశానవాటికగా ఉపయోగిస్తున్న స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారన్నారు. ఈ స్థలంపై మాల కులస్థులకు శ్మశానవాటిక కోసం హక్కుపత్రం ఇచ్చి న్యాయం చేయాలని ఆర్డీవోను కోరినట్లు చెప్పారు. వినతి పత్రం సమర్పించినవారిలో గ్రామస్థులు యాదయ్య, కృష్ణ, సలయ్య, కుమార్, లక్ష్మయ్య, మల్లేష్, దేవరాజ్, శోభ, సువర్ణ, యశోద తదితరులు పాల్గొన్నారు.

వివాహం కోసం ఆర్థికసాయం

నారాయణఖేడ్, ఏప్రిల్ 1: కంగ్టి మండలం తడ్కల్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన చాకలి నాగమణికి వివాహం నిశ్చయమైంది. విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ తరఫున ట్రస్టు ప్రతినిధులు గ్రామానికి వెళ్లి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని నాగమణికి అందజేశారు.

●కొల్చారం:మండలంలోని సీతారాం తండాకు చెందిన పాతులోతు శివరాం కూతురు వివాహం సోమవారం జరిగింది. బీజేపి నియోజకవర్గ నాయకులు రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో పుస్తెమట్టెలను మండల బీజేపీ అధ్యక్షుడు పాతూరి దయాకర్ గౌడ్ సోమవారం అందజేశారు.

బొంతపల్లిలో భద్రకాళీ సహిత వీరభద్రస్వామికి.. వైభవంగా అశ్వవాహనసేవ



గుమ్మడిదల: బొంతపల్లిలో అశ్వ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు



టేక్మాల్‌లోని దుర్గమ్మ, పోచమ్మ జాతరలో బండిశిడిపై అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

గుమ్మడిదల, ఏప్రిల్ 1 : మండలంలోని బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేద పండితులు ప్రతినిత్యం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి భద్రకాళీ సహిత వీరభద్రస్వామిని అశ్వవాహన సేవలో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు సోమయ్య ఆధ్వర్యంలో అశ్వవాహన సేవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వతందారులు ఆలేరు జగన్మోహన్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, కరణం పంతులు, గటాటి రవి, ముక్కల వెంకన్న, పొన్నబోయిన కృష్ణ భక్తులు అర్చకులు పాల్గొన్నారు.

టేక్మాల్‌లో బండి శిడి

టేక్మాల్, ఏప్రిల్ 1: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న దుర్గమ్మ, పోచమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం బండిశిడి ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. బండిశిడిని తీరొక్క రంగులతో అలకరించారు. బండిశిడిపై అమ్మవారి విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు. మండల ప్రజలు అధిక సంఖ్యలో రావడంతో ఆలయా ప్రాంగణం జనసంద్రమైంది. కార్యక్రమంలో ఎంపీపీ స్వప్న రవి, ఎంపీటీసీ వాణి, మాజీ సర్పంచ్ సుప్రజ, మండల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం: బీబీపాటిల్



ఖేడ్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్

నారాయణఖేడ్, ఏప్రిల్ 1: బీజేపీతోనే సమగ్రాభివృద్ధి, సుస్థిర పాలన సాధ్యమని జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ పేర్కొన్నారు. సోమవారం నారాయణఖేడ్‌లోని జీవన్ కన్వెన్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన అనంతరం దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. తాను జహీరాబాద్ ఎంపీగా గత పది సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానన్నారు. నిజాంపేట్-బీదర్ జాతీయ రహదారి నిర్మాణానికి కూడానిధులు మంజూరు చేయించామని, ప్రస్తుతం టెండర్లు కూడా పూర్తయ్యాయన్నారు. ఈ రహదారుల నిర్మాణం వల్ల నారాయణఖేడ్ నియోజకవర్గంలోని భూముల విలువ పెరిగిందన్నారు. తనకు మరోసారిఅవకాశం ఇస్తే అందరికి అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, బీజేపీ గిరిజన మోర్చా జాతీయ నాయకులు అమర్‌సింగ్‌పవర్, బీజేపీ రాష్ట్ర నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రవికుమార్, ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, రాజశేఖర్‌గౌడ్, రామకృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం, బీజేవైఎం నాయకులు తదితరులు ఉన్నారు. కాగా నారాయణఖేడ్ మండలం పోతన్‌పల్లి మాజీ సర్పంచు రాములు, బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి తన అనుచరులతో ఎంపీ బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. పెద్ద శంకరంపేట మండలం కొత్తపల్లిమాజీ సర్పంచు శ్రీశైలం, మాజీ వార్డు సభ్యులు సుధాకర్ బీజేపీలో చేరారు.

● టేక్మాల్: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అందోల్ అసెంబ్లీ నియోజకవర్గ క్రియాశీల కార్యకర్తల సమావేశంలో టేక్మాల్, చల్లపల్లి, బొడ్మట్‌పల్లి, కమ్మరికత్త, దాదాయపల్లి, తంపూర్, ధన్నారం, ఎల్లాస్‌పూర్, సూరంపల్లి, వేల్పుగొండ, ఎలకుర్తి గ్రామాలకు చెందిన 100 మంది కార్యకర్తలు ఎంపీ బీబీపాటిల్ సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్, మాజీ మండల అధ్యక్షులు రాజు తదితరులు ఉన్నారు.

పూలతో అగర్‌బత్తీల తయారీ.. మహిళలకు స్వయం ఉపాధి



అగర్‌బత్తీలను తయారు చేస్తున్న మహిళలు

శివ్వంపేట, ఏప్రిల్ 1: ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పలువురు మహిళలు పూలతో అగర్‌బత్తీలను తయారు చేస్తూ ఉపాధి పొందుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని ఎదుల్లాపూర్ గ్రామంలో భూరెడ్డిపెద్దపద్మ, లావణ్య, కల్పన, చిన్నపద్మ సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20రోజుల క్రితం అగర్‌బత్తీల తయారీ కేంద్రం ప్రారంభించి స్వయం ఉపాధి పొందుతున్నారు. వీరికి సెహగల్ ఫౌండేషన్ అగర్‌బత్తీలను తయారు చేసే విధానంలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. ఆయా ఆలయాల్లో ఉపయోగించిన పూలను సేకరించి ఎటువంటి రసాయనాలు లేకుండా ఈ అగర్‌బత్తీలను తయారు చేయడం విశేషం. తయారీకి కావాల్సిన యంత్రాలను కూడా ఫౌండేషన్ వారే ఇచ్చినట్లు మహిళలు పేర్కొన్నారు.

మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ ఇలాకాలో బీఆర్‌ఎస్ ఖాళీ!



మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమాలతాశేఖర్‌గౌడ్ దంపతులు

మనోహరాబాద్, ఏప్రిల్1: మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమాలతశేఖర్‌గౌడ్ సొంత మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి రోజు రోజుకూ వలసలు పెరుగుతూ ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొన్నది. జడ్పీ చైర్‌పర్సన్ భర్త ర్యాకల శేఖర్‌గౌడ్ గత 20 ఏళ్లుగా తూప్రాన్ ఉమ్మడి మండలంలో క్రియాశీలక కార్యకర్తగా, ఉద్యమకారుడిగా బీఆర్‌ఎస్ పార్టీకి ఎన్నో సేవలందించారు. ఉమ్మడి మండలంలో పార్టీని ముందుండి నడిపించారనడంలో అతిశయోక్తి లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ ర్యాకల శేఖర్‌గౌడ్ సేవలను గుర్తించి 2018లో అతడి భార్య ర్యాకల హేమలతకు ఏకంగా మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ పదవిని అప్పజెప్పారు. కాగా మండల కేంద్రంలో గత పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రతిపక్షం అనే మాటే లేకుండా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు అందరూ ఒకే పార్టీలో కొనసాగారు. బీఆర్‌ఎస్ పార్టీలో జడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలకు సంబంధించి రెండు వర్గాలుగా ఉన్నప్పటికీ అదే పార్టీలో కొనసాగారు. గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు అందరూ ఉమ్మడి మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ వారే కావడం గమనార్హం. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి మెజార్టీ రావడంతో పరిస్థితి తారుమారైంది. గతంలో బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగిన ప్రజాప్రతినిధులు, నాయకుల వలసలు కాంగ్రెస్‌లోకి భారీగా పెరిగాయి. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, తరువాత తూప్రాన్ ఉమ్మడి మండలాల ప్యాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ ర్యాకల కృష్ణాగౌడ్, సర్పంచులు ఉప సర్పంచ్‌లు ఇలా క్యూ కట్టారు. జడ్పీ చైర్‌పర్సన్ కుటుంబానికి సన్నిహితుడిగా ఉన్న రాష్ట్ర ఫుడ్‌కార్పొరేషన్ మాజీ చైర్మన్ గంగుమల్లా ఎలక్షన్‌రెడ్డి, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలసి ఈ నెల 5న కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్న విషయం అందరికి తెలిసిందే. దీంతో జడ్పీ చైర్‌పర్సన్ సొంత మండలంలో క్రమంగా బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొన్నది. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్‌పార్టీ మనుగడ చర్చనీయాంశంగా మారింది.

బీఆర్‌ఎస్ పార్టీని వీడేది లేదు: జడ్పీ చైర్‌పర్సన్

గత 20 ఏళ్లుగా మేము బీఆర్‌ఎస్ పార్టీ కోసం కష్టపడ్డాం. పదవులు లేకున్నా నేను పార్టీ మారే ప్రసక్తేలేదు. పార్టీలోకి మధ్యలో వచ్చినవారే వెళ్లిపోతున్నారు. మండలంలో మాకు సన్నిహితుడిగా మెదిలిన ఎలక్షన్‌రెడ్డి పార్టీ మారడం బాధాకరం. అయినప్పటికీ ప్రాణాలకు తెగించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌కు అండగా బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతాం.

జాతిపితకూ ముసుగేశారు..



పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కోడ్ అమలుల్లో ఉన్నందున్న ఎన్నికల నియమావళి ప్రకారం గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయడంతో పాటు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, పోస్టర్లు, గుర్తులను తొలగించాలి. కాని వెల్దుర్తి మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామంలో అధికారుల అత్యుత్సాహం జాతిపితకూ ముసుగేసింది. స్వాతంత్ర్య సమరయోధుడు, జాతిపిత గాంధీజీ విగ్రహానికి అధికారులు అవగాహనాలోపంతో ముసుగేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

- వెల్దుర్తి, ఏప్రిల్ 1

కాంగ్రెస్ ఇంటికి వెళ్లడం తథ్యం



లబ్ధిదారుకు మోదీ గ్యారంటీ కార్డును అందజేస్తున్న బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇంటికి వెళ్లడం తథ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. లాబర్తి సంపర్క్ అభియాన్‌లో బాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని 157 పోలింగ్ బూత్‌లో ప్రధాని మోదీ పథకాల ద్వారా లబ్ధి పొందినవారి ఇంటికి వెళ్లి ప్రధాని మోదీ గ్యారెంటీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాజు, బూత్ అధ్యక్షులు చిరంజీవి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నవోదయకు నలుగురు విద్యార్థుల ఎంపిక



శ్రీనికరెడ్డి, సహస్ర, సాత్విక్, గగన్‌మహేష్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 1: జవహర్ నవోదయకు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలను ఆదివారం విద్యాశాఖ విడుదల చేసింది. ఈ ఫలితాల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సహస్ర, సాత్విక్, గగన్‌మహేష్ ఎంపిక కాగా.. సిద్ధార్థ్ రూరల్ స్కూల్‌కు చెందిన శ్రీనిక రెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించాడు.

సెహగల్ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

శివ్వంపేట, ఏప్రిల్ 1: గ్రామాల అభివృద్ధికి సెహగల్ ఫౌండేషన్ సంస్థ చేస్తున్న కృషి ఆదర్శనీయమని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పి.రవి పేర్కొన్నారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరువు కట్ట వెడల్పు పనులు పూర్తి చేయడంతో దానిని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ సెహగల్, సురిసిసింగ్,నవనీత్, నలావుద్దీన్, నరసింహారెడ్డి, మహేష్‌గౌడ్, సుదర్శన్, శ్రీధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు

మహిళా రైతులకు పరికరాల పంపిణీ

చేగుంట, ఏప్రిల్1: మండలంలోని పులిమామిడి గ్రామంలో మహిళా రైతులకు సుమారు రూ.3.40లక్షల విలువ చేసే భూమి చదును చేసే యంత్ర పరికరాలను అందజేశారు. అంతేకాకుండా రూ. 40 వేల విలువ చేసే మినీ రైస్ మిల్లును అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు సెహగల్ మాట్లాడారు. మహిళా రైతుల అభివృద్ధి కోసం సెహగల్ ఫౌండేషన్ ట్రస్టు ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందన్నారు.

పెద్దమ్మ ఆలయానికి భూమి పూజ

మనోహరాబాద్, ఏప్రిల్ 1: మండలంలోని దండుపల్లి గ్రామంలో నూతనంగా పెద్దమ్మ తల్లి ఆలయానికి ముదిరాజ్ కులస్థుల ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, పాల్గొన్నారు. గ్రామంలోని శ్రీరాములుపంతులు ఆధ్వర్యంలో ముదిరాజు కులస్థులు స్థానిక పెద్ద చెరువు పక్కన స్థలంలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణగౌడ్, పంజా బిక్షపతి, రాజు, వెంకటేష్, సోములు, వేంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.



దండుపల్లిలో భూమి పూజ చేస్తున్న ముదిరాజ్ కులస్థులు

ఉపాధిహామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



మక్తా అల్లూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నర్సింహులు

కంది, ఏప్రిల్ 1 : ఉపాధిహామీ కూలీలకు మెడికల్ కిట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, కూలీలకు తట్ట, బుట్ట వంటి పరికరాలను ప్రభుత్వమే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. సోమవారం కంది మండలంలోని మక్తాఅల్లూరులో ఉపాధిహామీ పనులు జరుగుతున్న చోట ఆయన ఉపాధిహామీ కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ జియో ట్యాగింగ్ పేరుతో ఫొటోలు తీస్తూ ఉపాధిహామీ కూలీలను, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 15 రోజుల్లోగా ఇచ్చే కూలీ డబ్బులను ఎనిమిది వారాలుగా ఇవ్వడం లేదని, ఉపాధి బకాయిలను వెంటచే చెల్లించాలన్నారు. సంవత్సరంలో 200 రోజులు కూలీలకు పని కల్పించాలని, లేదంటే ఎద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఉపాధిహామీ కూలీలు రుక్కమ్మ, రమేశ్, జయమ్మ, బాగయ్య, మైబూ, శ్రీశైలం, రాములు, అనసూజ, బాలమణి, లక్ష్మి, విఠలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలి



మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులతో నీలం మధు

జిన్నారం, ఏప్రిల్ 1: మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని మెదక్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం బొల్లారంలోని మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి నివాసంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులను నీలం మధు మర్యాదపూర్వకంగా కలిశారు. కౌన్సిలర్లు చంద్రారెడ్డి, చంద్రయ్య గోపాలమ్మ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు తదితరులు ఎన్నికల ప్రచారంపై చర్చించారు. ఈ సందర్భంగా నీలం మధును నాయకులు సన్మానించారు.

నవచండీ యాగంలో షెట్కార్ దంపతులు



యాగంలో సురేష్ షెట్కార్ దంపతులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 1: ఖేడ్‌లోని మాజీఎంపీ, జహీరాబాద్‌పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ స్వగృహం ఆవరణలో శ్రీరాజ శ్యామల సహిత నవచండీ యాగం సోమవారం ప్రారంభమైంది. పూజా కార్యక్రమాలను చండీ ఉపాసకులు అయ్యప్పస్వామి, అజయ్‌స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. యాగంలో సురేష్ షెట్కార్, ఉమాదేవి దంపతులతో పాటు కుటుంబీకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 1: విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, మహేష్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సంగారెడ్డిలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలో చేసిన తీర్మానాలను అమలు చేసేందుకు భవిష్యత్తులో ఉద్యమాలు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు నేహా, నాయకులు కార్తీక్, శ్రీవాణి, రాజ్‌కుమార్, తుకారం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నారాయణఖేడ్, ఏప్రిల్ 1: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు. సోమవారం ఖేడ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఒకేసారి సెలవులు ఇవ్వాలని, సమ్మె సందర్భంలో గత ప్రభుత్వం వేసవి కాలంలో సెలవులు ఇస్తామని హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఓటమిని జీర్ణించుకోలేకే విమర్శలు: కాంగ్రెస్

మనూరు, ఏప్రిల్ 1: ఓటమిని జీర్ణించుకోలేకే నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి జహీరాబాద్‌పార్లమెంట్ అభ్యర్థి సురేష్ కుమార్ షెట్కార్‌పై విమర్శలు చేస్తున్నారని మనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాష్‌రావు, తాలుకా స్థాయి నాయకులు పోతుల సంగారెడ్డి ఆరోపించారు. సోమవారం మనూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా సురేష్ షెట్కార్‌కు అధిష్ఠానం బీ ఫాం ఇచ్చిన విషయం విదితమే. అయితే ఆ బీ ఫాంను రూ.5 కోట్లకు అమ్ముకొని పోటీ నుంచి తప్పుకున్నాడని భూపాల్‌రెడ్డి విమర్శలు చేయడంసరికాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్‌పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రూప్‌సింగ్, తదితరులు ఉన్నారు.

మల్లన్న దీవెనతో చల్లంగా ఉండాలి: సునీతారెడ్డి

హత్నూర, ఏప్రిల్ 1: మండల పరిధిలోని రెడ్డిఖానాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఎంపీపీ అధ్యక్షుడు వావిలాల నర్సింహులు హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

● చిలప్‌చెడ్: మండలం పరిధిలోని జగ్గంపేటలో మూడు రోజులుగా కొనసాగుతున్న హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన, శివపంచాయతన నూతన విగ్రహాల పతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం చివరి రోజున ధ్వజస్తంబ ఏర్పాటు, విగ్రహాల ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు వేద పండితులచే గ్రామ హనుమాన్ భక్త మండలి వారు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.